www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 ఫిబ్రవరి 2023

5

అన్నమయ్య



52 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 14 సచివాలయంలో పనిచేస్తున్న 52 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపిడిఒ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడవ తేదీన సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజు మూడుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి ఉందన్నారు. అలా వేయని వారికి నోటీసులు జారీచేశామని పేర్కొన్నారు. ఇంత వరకు వారు నోటీసులకు సమాధానం ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి నెల వేతనం నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. సమయపాలన పాటించని మండల స్థాయి అధికారుల సమాచారాన్ని సూచనలు పాటించక నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి చర్యలు తప్పవని హెచ్చరించారు 14 సచివాలయాల్లో 143 మంది సచివాలయం పనిచేస్తున్నారని, అందులో 52 మందికి ఫిబ్రవరి నెల జీతం కోతపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎఎన్ఎం కౌన్సెలింగ్‌లో అయోమయం

- సీనియారిటీ జాబితాలో జూనియర్ల పేర్లు!
- డేట్ ఆఫ్ జాయినింగ్‌కు ఎఎన్ఎంల డిమాండ్
- ఊగిసలాటలో ఆర్‌డి యంత్రాంగం

జిల్లాలో ఎఎన్ఎం కౌన్సెలింగ్‌లో అయోమయం నెలకొంది. సెకెండ్ ఎఎన్ఎం, ఇసిఎఎన్ఎం, కాంట్రాక్టు ఎఎన్ఎం, సచివాలయ ఎఎన్ఎంల కౌన్సెలింగ్‌కు రంగం సిద్ధమైంది. సీనియారిటీ జాబితా ఆధారంగా సెకెండ్ ఎఎన్ఎంల ముందు వరుసలో ఉండాల్సి ఉంది. అనంతరం ఇసి ఎఎన్ఎంలు, సచివాలయ ఎఎన్ం, కాంట్రాక్టు ఎఎన్ఎంలు ఉండాలని తెలుస్తోంది. ఇటీవల నియమితులైన సచివాలయ ఎఎన్ఎం, ఇసి ఎఎన్ఎంల పేర్లు కూడా సీనియారిటీ జాబితాలో ఉండడం గందరగోళానికి కారణమని తెలుస్తోంది. రెగ్యులర్ ఎఎన్ఎంలకు ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇస్తే అభ్యంతరం లేదని, సీనియారిటీని విస్మరిస్తే సీనియర్ల పరిస్థితేమిటని సెకెండ్ ఎఎన్ఎంలు వాపోతున్న వైనం విస్మయాన్ని కలిగిస్తోంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రమైన ఆర్‌డి కార్యాలయ పరిధిలోని 329 మంది ఎఎన్ఎంల కౌన్సెలింగ్ రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌డి కార్యాలయం శుక్రవారం రాత్రి సీనియారిటీ జాబితాను ప్రకటించింది. సీనియారిటీలో జూనియర్లు అయిన సచివాలయ, ఇసిఎఎన్ఎంల పేర్లు ఉండడం ఆందోళనకు కారణమని తెలుస్తోంది. 2007లో సెకెండ్ ఎఎన్ఎంలు, 2009లో ఇసిఎ ఎన్ఎంలు, 2019లో సచివాయల ఎఎన్ఎంలు, కాంట్రాక్టు ఎఎన్ఎంలను ఆయా ప్రభుత్వాల ప్రాధాన్యాత ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేసినట్లు తెలుస్తోంది. కౌన్సెలింగ్‌ల్లో ఎఎన్ఎంలకు సీనియారిటీ ఆధారంగా బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఆర్‌డి కార్యాలయం శుక్రవారం సెకెండ్ ఎఎన్ఎం, ఇసిఎఎన్ఎం, సచివాలయ ఎఎన్ఎం, కాంట్రాక్టు ఎఎన్ఎం కేటగిరీల్లోని 329 మంది ఎఎన్ఎంల సీనియారిటీ ఆధారంగా జాబితాను విడుదల చేసింది. 83 మంది రెగ్యులర్ ఎఎన్ఎంలు సీనియారిటీ జాబితాకు అర్హులని తెలుస్తోంది. మిగిలిన సచివాలయ ఎఎన్ఎమ్‌లు, ఇసి ఎఎన్ఎంలకు డేట్ ఆఫ్ జాయినింగ్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండడం ప్రకృతి సహజన్యాయ సూత్రాల ఆధారంగా సమంజసమనే డిమాండ్ వినిపిస్తోంది. ఇందుకు అనుగుణంగానే 2022 డిసెంబర్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లోనూ సీనియారిటీ ఆధారంగానే కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతిని సెకెండ్ ఎఎన్ఎంలు గుర్తు చేస్తుండడం గమనార్హం. సీనియారిటీ జాబితాలో సెకెండ్ ఎఎన ఎంల స్థానంలో ఇసి ఎఎన్ఎంల పేర్లు చోటు చేసుకోవడంలో మతలబేమిటో ఆర్‌డి కార్యాలయం చెప్పాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇందులో ఓ సీనియర్ అసిస్టెంట్ మొత్తం వ్యవహారాన్ని నడిపించడమే కారణమనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు రాష్ట్రంలోని నాలుగు జోన్లలో ఎక్కడాలేని విధంగా జోన్-4లోని కౌన్సెలింగులు వివాదాస్పదంగా మారుతుండడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎఎన్ఎంల సీనియారిటీ సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. శుక్రవారం నాటి కౌన్సిలింగ్ సమయానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందితేసరి, అందని పక్షంలో యథాతథం గానే కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.

- డాక్టర్ కోటేశ్వరి, వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డి, కడప.

'రక్తహీనత నివారణకు చర్యలు'

ప్రజాశక్తి-రాయచోటి

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి అనీమియా, గడపగడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతోరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఎంహెచ్ఒ కొండయ్య, డిపిఒ ధనలక్ష్మి, సిపిఒ కృష్ణనాయక్ హాజరయ్యారు. ఈ సదర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఎంత మంది గర్భిణులున్నారు, ఎంత మంది రక్తహీనతతో బాధపడుతున్నారు, వారికి ఐరన్ టాబ్లెట్లు, పౌష్టికాహారం అందేటట్లు చూడాలన్నారు. పాఠశాలల వారీగా అనీమియా విద్యార్థులను గుర్తించి రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ పాఠశాలలో చదివే చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేస్తూ వయసుకు తగ్గ బరువు ఎత్తు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణులలో రక్తహీనతను దూరం చేయడానికి పోషకాహారమైన భోజనం తీసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డాక్టర్లు గ్రామంలో ఇంటింటికి వెళ్లి సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులకు, బాలింతలకు, రక్త హీనత ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ సమస్య ఉన్న వారికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, కార్యక్రమంలో గుర్తించిన ప్రాధాన్యతా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ జిల్లాలోని సచివాలయాల వారీగా గర్భిణులకు, బాలింతలకు ఐరన్ టాబ్లెట్లు, పౌష్టికాహారం సక్రమంగా అందేటట్లు చూడాలని ఐసిడిఎస్ పీడీకి సూచించారు. అంగన్వాడీ పాఠశాలల్లో చదివే చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేస్తూ వయసుకు తగ్గ బరువు ఎత్తు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రక్తహీనతను పూర్తిగా నివారించి ప్రతి సచివాలయం పరిధిలో ఒక్కరూ అనీమియా బాధితులు లేకుండా ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, అధికారులు

మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదు

కడప కలెక్టరేట్ వద్ద ఎపిడబ్ల్యూజెఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై డాక్యుమెంటరీ విడుదల చేసిన బిబిసిపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఐటి దాడులు చేయించడం శోచనీయమని, మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) నాయకులు అన్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కడప కలెక్టరేట్ వద్ద మీడియా ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2002లో గుజరాత్ మత మారణహోమంలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి, నేటి ప్రధాని నరేంద్ర మోడీ పాత్రను బయట పెట్టినందుకు బిబిసి వార్తా ఛానల్ పై కేంద్రం వేధింపులకు దిగిందన్నారు. ఈ చర్యను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఢిల్లీలోని బిబిసి కార్యాలయాలపై ఆదాయపు పన్ను అధికారులు సెర్చ్, సర్వే పేరుతో దాడులకు దిగడం పత్రికా స్వేచ్ఛపై పరోక్ష కక్ష సాధింపుకు పాల్పడడమేనన్నారు. ప్రధాని మోడీ నిజ స్వరూపాన్ని బయటపెట్టినందుకు ఇప్పటికే బిబిసి డాక్యుమెంటు లింకులను సామాజిక మాధ్యమాల్లో పెట్టడాన్ని నిషేధించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు నేరుగా ఆ వార్తా ఛానల్ పైనే దాడులకు దిగిందన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్న నరేంద్ర మోడీ చర్యలను అందరూ ఖండించాలని వారు పిలుపునిచ్చారు. మీడియా స్వేచ్ఛను హరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని, హక్కులను హరించాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కాటిబోయిన నారాయణ, చంద్రమోహన్‌రాజు, చౌడం సూరిబాబు, మన్సూరు నూరుబాషా, ముద్దా సిద్దయ్య, సి.ఎస్.ప్రసాద్, నల్లి బాలకృష్ణ, టేకూరి సుదర్శన్, దూళిపాటి రాఘవులు, కొనెజయ దుర్గాప్రసాద్, జంబారపు రవికుమార్, బ్రహ్మానందరాజు, చౌడం నాగార్జున, టక్కోలి ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు, జర్నలిస్టులు

ప్రణాళికా బద్ధంగా భూముల రీసర్వే : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే పనులను జిల్లాలో ప్రణాళికా బద్ధంగా సాగుతోందని కలెక్టర్ గిరీష తెలిపారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జిల్లాలో రీసర్వే చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూ థింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు , భూ రక్ష పథకం, రీసర్వే, గ్రౌండ్ ట్రూతింగ్, తదితర అంశాలపై కలెక్టర్‌లు, జెసిలతో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, సెక్షన్ 13 నోటిఫికేషన్, ఫైనల్ ఆర్ఒఆర్, భూ హక్కు పత్రం ఇకెవైసి, సెక్షన్ 9(2) నోటీస్, డ్రోన్ ఫ్లయింగ్, 9(2)/10(2) నోటీస్ సర్వేడ్, 9(2)/10(2) ఆఫీస్ డిస్పోజల్ మొబైల్ మెజిస్ట్రేట్ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే రెవెన్యూ, సర్వే సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే బృందాల సంఖ్యను పెంచి, లక్ష్యాల మేరకు సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువులోగా గ్రౌండ్‌ట్రూతింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ తరువాత వెట్రిజేషన్, విలేజ్ సర్వేయర్, విఆంఒ లాగిన్‌లో డేటా ఎంట్రీ సకాలంలో చేయాలన్నారు. హద్దురాలు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీష మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు రీసర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియను పూర్తి చేయగలిగామని చెప్పారు. జిల్లాలో భూముల స్వచ్ఛీకరణ ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా ఎప్పటికప్పుడూ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయారాజ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

జగన్ రాజ్యాంగంలో రక్షణ కరువు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని విస్మరించి జగన్ రాజ్యాంగం రాష్ట్రంలో నడుస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులపై తాను విమర్శలు చేసి కోర్టులను తప్పుదారి పట్టిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేసి వీడియో ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రచారం చేయాల్సింది వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలి వేటును గుండెపోటుగా చిత్రీకరించడం, బాధితులపైనే కేసులు బనాయించి బాధ్యులను చేయడం వంటి వాటిని ప్రచారం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసులు 95 శాతం నిజాయితీగా ఉన్నారని తెలిపారు. మిగిలిన వారు రాష్ట్ర ప్రభుత్వానికి గులాములుగా వ్యవహరిస్తూ అధికార పార్టీ నేతలకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి గుర్తితో గెలిచి వైసిపితో కలిసి పనిచేస్తున్న వంశీ గన్నవరంలోని టిడిపి పార్టీ కార్యాలయంపై అనుచరులతో కలిసి దాడి చేసి కార్లు ధ్వంసం చేసి కార్యకర్తలను చితకబాదినా పోలీసులు అడ్డుకోలేకపోయారని, వారికే వత్తాసు పలుకుతూ సహకరించారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో అధోగతి పాలైన రాష్ట్ర స్థితిగతులను మార్చడానికి ప్రజల కోసం ఈ వయసులో చంద్రబాబు నాయుడు పర్యటనలు చేస్తే సహించలేక అడుగడుగునా పోలీసు బలగాలతో అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. లోకేష్ బాబు చేస్తున్న యువగళం పాదయాత్రకు వస్తున్న విశేష స్పందన చూసి జగన్‌రెడ్డికి దిక్కుతోచక ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. కేసులకు, రిమాండ్లకు భయపడేది లేదని.. రానున్నది టిడిపి ప్రభుత్వమేనని 24 శాతం వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సుధాకర్, మండల అధ్యక్షులు సుబ్బ నరసయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు అబూబకర్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అగ్నిమాపక కేంద్రం అధికారి పి.శివశంకర్‌రెడ్డి, వారి సిబ్బంది డి.శివయ్య, సత్యరాజు, పి.రవీంద్రబాబు, శివశంకర్, రాజేష్, చక్రవర్తి, రాజన్నలు మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కళాశాలలో ఫైర్ సిస్టమ్ మానిటరింగ్ టీమ్ చేత మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం రాజంపేట అగ్నిమాపక కేంద్రం వారి సహాయంతో మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, తమను తాము ఎలా రక్షించుకోవాలి అనే విషయాలపై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మొదటగా భయపడకుండా ధైర్యంగా ఉంటూ ప్రమాదాల నుంచి తమను తాము రక్షించుకోవాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది కళాశాలలోని సెక్యూరిటికి, సిబ్బందికి ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తమ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అమూల్యమైన సూచనలు, సలహాలు ఇచ్చినందుకు కళాశాల యాజమాన్యం అగ్నిమాపక అధికారి శివశంకర్‌రెడ్డికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్ఆర్‌టియుసి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పీలేరు

వైఎస్ఆర్‌టియుసి అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన చిన్నయల్లప్ప తెలిపారు. గురువారం ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అతని స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అధ్యక్ష పదవి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు పి.గౌతంరెడ్డి, పీలేరు, రామచోటి, చంద్రగిరి ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ హరీష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

-చివరి రోజు రెండు నామినేషన్లు

ప్రజాశక్తి - కడప

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల చివరి రోజు అయిన గురువారం రెండు నామినేషన్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండం గాదెల గ్రామానికి చెందిన నాయుడోరి రమణయ్య నామినేషన్ దాఖలు చేశారు. జెసి, రిటర్నింగ్ అధికారి సాయికాంత్ వర్మకు నామినేషన్ ఇచ్చారు. వైసిపి తరుపున పి. రామసుబ్బారెడ్డి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 24 నుంచి నామినేషన్లను పరిశీలించనున్నారు. ఉపసంహరణకు ఈనెల 27న చివరి గడువు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 95 మందికి ఉద్యోగాలు

మదనపల్లె అర్బన్: స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కాలేజ్‌లో చెన్నైకు చెందిన టెక్ మహీంద్రా కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో 95 మంది విద్యార్థులు బిసినెస్ ప్రోగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కొరకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ గురుప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.5 లక్షలు ఉంటుందన్నారు. చెన్నైలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. క్యాంపస్ సెలెక్షన్స్ ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, ప్లేసెమెంట్ ఆఫీసర్ మహేష్ అభినందించారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

రాయచోటి : అన్నమయ్య, కడప జిల్లాల నారాయణ విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన మెడల్ యూనిటేడ్‌లో రాయచోటి నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో మూన్ కార్యక్రానికి ఎంపికయ్యారని పాఠశాల ఎజిఎం రాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు డి. విజ్ఞ శ్రీ , జి .నేహా, ఆసిన్, రేష్మలు ఎంపికయ్యారన్నారు.ప్రపంచంలోని వివిధ దేశాలు, వారి సాంప్రదాయాలు, కట్టు బాట్లను గురించి అవగాహన పరచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. ఖాదర్ వలి, ఆర్ఐ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ దాడులను తక్షణమే ఆపాలి

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో రోజురోజుకూ రాజకీయ దాడులు అధికమవుతున్నాయని, దీని వల్ల దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విలువలను భంగం కలుగుతున్నాయని డిసిసి జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ దినపత్రికలో చూసినా, ఏ ఒక్క టీవీ ఛానల్లో చూసినా కేవలం రాజకీయ దాడులు మాత్రమే ప్రదర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తూ ఉంటే ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని పక్కన కేవలం రాజకీయ దాడులపై దృష్టి సారించాయని వాపోయారు. ఇరుపార్టీల వారు కక్ష సాధింపు చర్యలను వెంటనే ఆపి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తే బాగుంటుందని తెలిపారు. రాజకీయ దాడుల నేపథ్యంలో పోలీసు వ్యవస్థ న్యాయబద్ధంగా వ్యవహరించి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని పేర్కొన్నారు. రాబోయే 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చే బడ్జెట్ పై దృష్టి సారించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

ఇ-పంట నమోదుకు 28న తుది గడువు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రబీ 2022-23 సంవత్సరానికి సంబంధించి సాగు చేసిన పంటలకు రైతులు ఇ-పంట నమోదు, బయోమెట్రిక్ ఈ నెల 28వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి జి.రాజకుమారి ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ పంట నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.



కంభంవారిపల్లెలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలి

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కంభంవారిపల్లికి వచ్చిన కిషోర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంరతం కంభంవారిపల్లి మండలంలో గ్రామాల వారిగా పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో మార్చి 4, 5వ తేదీల్లో లోకేష్ పర్యటన ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే పాదయాత్రకు టిడిపి కుటుంబ సభ్యులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి కోరారు. కార్యక్రమంలో కెవి.పల్లి మండల అధ్యక్షులు గీతమ్మ, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి, పీలేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మహేంద్రరెడ్డి, ఆర్.రెడ్డెప్పరెడ్డి, వెంకట రమణ నాయుడు, పీలేరు నియోజకవర్గ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అవినాష్‌రెడ్డి, బాబు నాయుడు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు అగస్తేశ్వర, కలికిరి మండలం ఎస్‌టి సెల్ అధ్యక్షులు వర్మ, బిసి సెల్ ఉపాధ్యక్షులు భాస్కర, యల్లయ్య, నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



రాజంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా, వేదికపై నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని, తిరిగి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మునక్కాయలపల్లి సమీపంలోని ఓ కల్యాణమండపంలో గురువారం ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆకేపాటి మురళిరెడ్డి, నాయకులు యోగేశ్వర్‌రెడ్డి, కొండూరు శరత్‌కుమార్‌రాజు, ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, పృథ్వీపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** నూతనంగా నియమితులైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి కుటుంబానికీ సన్నిహితంగా ఉంటూ గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు తెలియజేయాలని ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయ వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ముఖ్యంగా కేటాయించిన గృహాలపై అహగాహన కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలలోకి పూర్తి స్థాయిలో తీసుకువెళ్లేలా ఉండాలన్నారు. వాలంటీర్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని వార్డు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



క్షయ రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సృజన

పేద క్షయ రోగులను దత్తత తీసుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

పేద క్షయ రోగులను దత్తత తీసుకోవాలని టిబి యూనిట్ అధికారి డాక్టర్ సృజన కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా క్షయ రోగులకు నెలనెలా వారికి కావలసిన పౌష్టికాహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. టిబి యూనిట్ పరిధిలోని నందలూరు, రాజంపేట పెనగలూరు మండలాల్లో ప్రస్తుతం చికిత్సలో ఉన్న 150 మంది రోగులకుగాను 18 మందిని మాత్రమే దత్తత తీసుకున్నారని పేర్కొన్నారు. క్షయ రోగులకు ప్రభుత్వం ఉచిత మందులు, నెలకు రూ.500 అందిస్తోందన్నారు. రోగులకు నెలకు సరిపడా పౌష్టిక ఆహారం దాతలు అందిస్తే మెరుగైన వైద్యంతో పాటు త్వరగా కోలుకోవడానికి సహకరించిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా క్షయ చికిత్స సమన్వయకర్త నాగేంద్ర, సూపర్వైజర్ జయ ప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ప్రపంచ స్థాయి స్కేటింగ్ పోటీలలో విస్డమ్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారని కరస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేపాల్‌లో జరిగిన ప్రపంచ స్థాయి స్కేటింగ్ పోటీలలో 2, 3 తరగతులు చదువుతున్న ఎం.రేవంత్ కుమార్, పునీత్‌రామ్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇద్దరూ బంగారు పతకాలు, ఒక బంగారు గణపతి షీల్డ్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ప్రదీప్‌తో పాటు అకాడమిక్ డైరెక్టర్ టి.మదన్మోహన్ అభినందించారు.

రేపటి నుంచి శెట్టివారిపల్లిలో జాతర

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పట్టణంలోని శెట్టివారిపల్లెలో వెలసిన పోలేరమ్మజాతర శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మారునేని వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం రాత్రి దేవాలయం చుట్టూ చాందిని బండ్లతో ఊరేగింపు చేయడం జరుగుతుందన్నారు. చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం దేవాలయం వద్ద బోనాలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని పెద్దూరు రోడ్డులో నివాసమున్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తి నుంచి రూ.2.60 లక్షలు విలువ చేసే ఉచిత రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ సిఐ రెడ్డెప్ప పేర్కొన్నారు. చౌక దుకాణాల నుంచి వస్తున్న ఉచిత బియ్యాన్ని వినియోగదారుల వద్ద నుంచి కొనుగోలు చేసి తన 148 సంచులలో నిల్వ ఉంచడంతో టిడి తిమ్మారెడ్డితో కలసి దాడులు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని 31వ షాపు డీలర్‌కు అప్పగించి, వెంకటేశ్వర్లు పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తహశీల్దార్ దైవాదీనం తన సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గురువారం గాలివీడు మండలం గోరాన్ చెరువు గ్రామ పరిధిలోని స్థానిక ఉర్దూ పాఠశాల వద్ద సర్వే నంబర్ 945(1) ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. గతంలో అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను బేఖాతరు చేసి పిల్లర్ల ఏర్పాటు చేయడంపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని చెప్పారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆక్రమణను అడ్డుకున్నామన్నారు. అనంతరం సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ రవీంద్రారెడ్డి, సర్వేయర్ రవికుమార్, విఆర్ఎలు కుమార్, అలీ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులచే ఫర్నీచర్ తయారీ

ప్రజాశక్తి-కలికిరి

పట్టణంలోని జెఎన్‌టియుఎ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు కళాశాలకు కావలసిన ఫర్నీచర్ తయారు చేశారు. కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ వర్క్‌షాప్‌లో అక్కడ ఉన్న యంత్ర సామగ్రిని ఉపయోగించి కళాశాలకు కావలసిన ఫర్నీచర్ తయారు చేయడం ప్రారంభించారు. కళాశాలలోని ప్రయోగశాలలకు, డ్రాయింగ్ హాల్లో విద్యార్థులకు కావలసిన 60 కుర్చీలను తయారు చేసి ప్రిన్సిపల్ ఎస్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రయోగశాలలకు అందించారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగ అధిపతి డాక్టర్ వి నాగప్రసాద్ నాయుడు నాన్ టీచింగ్ సిబ్బందిని ఫర్నిచర్ తయారీకి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇతర విభాగ అధిపతులను కూడా కళాశాలలకు కావలసిన సామగ్రి, సాఫ్ట్వేర్‌ను పెంపొందించి కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని ప్రిన్సిపల్ కోరారు. కార్యక్రమం నందు వైస్ ప్రిన్సిపల్ సి సుభాష్, ఎలక్ట్రికల్ విభాగ అధిపతి డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ నజీరా, సివిల్ విభాగాధిపతి డాక్టర్ నీరజ, హెచ్‌అండ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ సరిత ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ అవర్ణ, లైబ్రరీ ఇంచార్జీ జప్పూర్నిస్, మ్యాథమెటికల్ ప్రొఫెసర్ డాక్టర్ చంగల్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

26న తవ్వా వెంకటయ్యకు అభినందన సభ

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 26న ఖాజీపేట మండలం తవ్వారిపల్లె వాసి యువరచయిత, సాహిత్య పరిశోధకుడు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు బొమ్మిశెట్టి మోహన్, రమేష్, మురళి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని సాయిభగవాన్ కళ్యాణమండపంలో సభను ఏర్పాటు చేశామన్నారు. మైదుకూరు ఫ్రెండ్స్ వాట్సప్ గ్రూపు సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ ఆకుల దర్బార్ సుబ్రహ్మణ్యం, గవిరెడ్డి రవిశంకర్‌రెడ్డి, చొక్కం రమణయ్య, తిప్పిరెడ్డి జయనరసింహారెడ్డి, వేణు గుప్తా, రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ తవ్వా వెంకటయ్య ఇటీవల ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులుగా ఎన్నికైన విషయం విదితమే. సాహితీవేత్తలు, రచయితలు, చరిత్ర పరిశోధకులు, కవులు, ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని బొమ్మిశెట్టి బ్రదర్స్ కోరారు.

అసమర్థ పాలనను ఇంటికి సాగనంపుదాం : ఆర్ఆర్



ఇదేంఖర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్రంలో అసమర్థ పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ రమేష్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలం లోని కుర్నూతల, కాస్తురాజు గారిపల్లె పంచాయితీలలో వాయలరాజుగారిపల్లె, ఎగువ గొల్లపల్లి, దిగువగొల్లపల్లి, ఎగువ బత్తిన వాండ్లపల్లె, దిగువ బత్తిన, ఎత్తపువాండ్ల, తురకపల్లె, సిద్ధకవాండ్లపల్లెలలో ఇదేంఖర్మ రాష్ట్రానికి, రచ్చ బండ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ప్రతిఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, అరాచకాలు పెరిగి పోయాయని ప్రజలకు వివరించారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్య ప్రజలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు,పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, చెత్త పన్ను, ఇంటి పన్ను విపరీతంగా పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. ప్రజలు టిడిపి ఆదరించి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నారా లోకేష్ పాదయాత్రకు మద్దతు తెలిపి విజయంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కలాడి ప్రభాకర్ రెడ్డి, బిసి సెల్ ఆర్గనేజింగ్ సెక్రటరీ జయరామ, కొండూరుగజపతిరాజు, వెంకట్రామరాజు, వైస్ సర్పంచ్ వెంకట్రామరాజు, గంగాల శ్రీనివాసులు, మల్లి కార్జున, సుధీర్, శ్రీకాంత్‌రెడ్డి, బడుగు శ్రీనివాసులు,ఈర్ల వెంకటేష్, బడుగు మహేష్, పత్తి సతీష్ ,మూర్తి గిరి బాబు ,బడుగు మల్లి కార్జున ,ఈర్ల పీచు ,పత్తి శీను, జింక పిచ్చయ్య, మూర్తి నాగరాజు, మూర్తి రమేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మార్చి నెలలో జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పోలింగ్ కేంద్రంగా కేటాయించారు. గురువారం మదనపల్లె ఆర్‌డిఒ మురళి, తహశీల్దార్ ధనుంజయులు, ఎంపిడిఒ శంకరయ్య, అగ్రికల్చర్ ఎఒ మురళీమోహన్, ఎస్ఐ రామ్మోహన్ సంబంధిత అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే పట్టభద్రులు, ఉపాధ్యాయులకు పాఠశాలలోని 102, 104 నెంబర్ గల గదిని కేటాయించినట్లు తెలిపారు. అందులో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటు హక్కు ఎంతో విలువైనదని, పట్టభద్రులు,ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గౌడ్, విఆర్‌ఒలు వెంకటరమణ, అమర్ నారాయణ, విఆర్ఎలు ముజాయుద్దీన్ పాల్గొన్నారు. **ములకలచెరువు :** మార్చి నెలలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ శ్రీనివాసులు, సిఐ సాధిక్‌అలీ, ఎంఇఒ ఎన్ వెంకటరమణ, గురువారం పరిశీలించారు. పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, పోలింగ్ ఏజెంట్లు కూర్చునే వరుస క్రమము, కంపార్ట్మెంట్, లైటింగ్, తాగునీరు, ర్యాంప్ అంశాలను పరిశీలించారు. వారి వెంట ఎఎస్ఐ నజీర్ భాష, హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, విఆర్ఒ రత్నమ్మ ఉన్నారు. **మదనపల్లె అర్బన్ :** మార్చి నెలలో జరగబోయే శాసనమండలి ఎన్నికల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్‌లను, స్ట్రాంగ్



బి.కొత్తకోట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మురళి

రూములను డిఎస్‌పి కె.కేశప్ప, మదనపల్లి టూ టౌన్ సిఐ ఎస్ .మురళీకృష్ణ, తాలూకా సిఐ శివాంజనేయులు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐలు జి చంద్రమోహన్, హరిహర ప్రసాద్, ఎన్నికల విధి నిర్వహణ సిబ్బంది పోలింగ్ కేంద్రాలలో బారికేడ్లు, స్ట్రాంగ్ రూములను పరిశీలించి ఎన్నికల నిర్వహణ సిబ్బందికి డిఎస్‌పి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఇప్పటికే హైపర్ సెన్సిటివ్, .సెన్సిటివ్ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని నేర చరిత్ర కలిగినటువంటి పాత నేరస్తులను కూడా బైండోవర్ చేసామని తెలిపారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరగాలని అధికారులకు సూచించారు. **తంబళ్లపల్లి :** మండలంలో మార్చి 13న జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సిఐ షాధిక్‌అలీ, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డితో కలసి తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో రెండు గదుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

మళ్లీ జగన్‌ను సిఎం చేయడమే లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి- కలకడ

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిని చేయడమే మన ఆశయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కలకడలో గృహ సారథులు, వాలంటర్లు, వైసిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర వల్ల వైసిపి వచ్చే ప్రమాదమేమి లేదని, టిడిపికే నష్టమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు గృహసారథులు, వాలంటీర్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. గత 2019 ఎన్నికల్లో కావాలి జగన్- రావాలి జగన్ అనే నినాదంతో ముందుకెళ్లి ముఖ్యమంత్రి అయ్యారని, 2024లో మా నమ్మకం నువ్వే జగనన్న నిదానముతో ముందుకెళ్లి మరల ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. మండలంలో ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, జడ్‌పిటిసి హారిక, సింగల్ విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి, సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రవి కుమార్ రెడ్డి, మండల గృహ సారథి మోహన్రాజనాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు గ్రామ గృహసారథులు, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

దళిత, గిరిజనులకు భూ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి



మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

దళిత, గిరిజనుకుల భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాలిరెడ్డిపల్లిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బాలాజినగర్, శివాజి నగర్, బాలిరేడ్డిపల్లి, అరుంధతి వాడలో భూమిలేని దళిత, గిరిజనకుల వెంటనే భూ పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రామానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.శ్రీనివాసులు, జిల్లా కార్యధర్శి పందికాళ్ళ మణి, జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, మండల కార్యదర్శి కె.వెంకటరమణ, కె.కెశవులు ,రైతు సంఘం నాయుకులు సి.హరి, రమణ, గ్రామస్తులు పాల్గొనారు.

పంచాయతీరాజ్ శాఖ అధ్యక్షులుగా హబీబ్

ప్రజాశక్తి-పీలేరు

జిల్లా పంచాయతీ రాజ్ శాఖ వైసిపి అధ్యక్షులుగా పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషను నియమిస్తూ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా హబీబ్‌బాషా మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ హరీష్ రెడ్డి, మైనార్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహ్మద్ ఖాన్, నియోజకవర్గం పరిశీలకులు సహదేవరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు డాక్టర్ షేక్ హబీబ్ బాష, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎన్నికైన మహిత ఆనంద్ లను అభినందించారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు ఆబిద్, పరమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు అల్లాబకాష్, సంజీవయ్య, వైసిపి నాయకులు డివి.రమణ, మునీర్, కాలనీ చిన్న పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎల్ఐపిసి కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిశీలకులు నరసింహారావు ఆకస్మింగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని , నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసు కున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌పి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సబిత, హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నేటి సమాజానికి యువతే కీలకం'

గుర్రంకొండ : నేటి సమాజానికి యువతే కీలకమని వీడియో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఐరా ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ భారత్ కార్య క్రమాలలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, లక్ష్యం - భవిష్యత్తు ప్రణాళిక, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎస్ఐ, కళాశాల ప్రిన్సిపల్ అమరేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసిటిసి పనితీరుపై ప్రశంసలు

జమ్మలమడుగు : జమ్మలమడుగు వైద్య విధాన పరిషత్‌లోని ఐసిటిసిని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఐసిటిసి కేంద్రంలోని రికా ర్డులను, రిజిస్టర్లు ల్యాబ్ లను పరిశీలించారు. కౌన్సిలర్ వి.ప్రతాప్‌కుమార్ ఐసిటీసి కేంద్రం నిర్వహ ణపై అనుసరిస్తున్న విధా నాలను అభినం దించారు. లింకి ఎఆర్‌టి నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రొగ్రాం మేనేజర్ వి.భాస్కర్ మాట్లాడుతూ జమ్మలమడుగులోని ఐసిటిసి కేంద్రం, ల్యాబ్ సేవలు, రక్తనిధి కేంద్రం, క్షయవ్యాధి సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ఐసిటిసి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా మాట్లాడుతూ గతంలో పోలిస్తే రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు చాలా వరకు తగ్గారన్నారు. ఐసిటిసి కౌన్సిలర్ వి.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రక్తనిధి కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ నెల్సన్, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, నందకిషోర్, సునీల, భారతి పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను ఆదరించండి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎంను ఆదరించాలని ఆ పార్టీ జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ కోరారు. ప్రజా ఉద్యమ విరాళాలను గురువారం ఆయన ప్రజల వద్దకెళ్లి సేకరించారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ దేశంలో పెట్రేగిపోతున్న మత తత్వానికి వ్యతిరేకంగా సిపిఎం దేశ సమైక్యతకు కట్టుబడి పోరాడుతుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు అంబానీ, అదానీలకు దొచిపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం నినదిస్తున్నమన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, సిపిఎం నాయకులు సంజీవరాయుడు, శ్రీను, గోపి, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ విజయ్

రక్తహీనత రహిత సమాజమే లక్ష్యం

- రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయ్

ప్రజాశక్తి-కలికిరి

రక్తహీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యమని రివైసేడ్ చైల్డ్ హెల్త్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. అనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కలికిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆరోగ్య కేంద్రాల ద్వారా అందించే సేవలను తనిఖీ చేశారు. గర్భిణులకు ఎఎన్ఎంలకు నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించారు. ప్రతీ గర్భిణి రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ఐరన్ సంవృద్ధిగా గల ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే డాక్టర్ వైఎస్ఆర్ సంపూర్ణ పోషన్‌తో పాటుగా గోంగూర, మునగాకు, మెంతి ఆకు వంటి ఆకుకూరలను, బెల్లంతో చేసిన పిండి పదార్థాలు, కర్జురం, ఎండు ద్రాక్ష, రాగి సంగటి , జావ , చిక్కీలు వంటి ఆహారం ఏదో ఒకటి రోజు ఆహారం లో తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు. ఫలితంగా మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించవచ్చునని అన్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. కాన్పుల గది, వార్డులు, ఒపి, గదులు, పారిశుధ్యం, సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కావ్య సిహెచ్ఒ ఇందిరా దేవి, ఆరోగ్య పర్యవేక్షకులు హేమలత, సాలమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** మండలంలోని నగరిమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రివైసిడి చైల్డ్ హెల్త్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి గర్భిణి రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా హెచ్‌బి పరీక్షలు చేయించుకుని ఐరెన్ సంవృద్ధి గల ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫి, డాక్టర్ కీర్తి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **రామసముద్రం :** మండలంలోని పిహెచ్‌సిని రివైసేడ్ చైల్డ్ హెల్త్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ మదనపల్లె డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ .డాక్టర్ లక్ష్మీ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీలతో కలసి సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ లీల, ఆరోగ్య విస్తరణ అధికారి హరనాథ్, రమణ, పర్యవేక్షకులు శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ప్రారంభం

కలికిరి : పట్టణంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా శిరీ ఆగ్రో మార్ట్ ఎరువుల దుకాణాన్ని జిల్లా మేనేజర్ అనేష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేసే క్రమంలో సరైన సలహాలు లేక వ్యవసాయానికి మితిమీరిన ఖర్చులు వెచ్చిస్తూ నష్టాల బారిన పడుతున్నారని అన్నారు. అలాంటి వారికి సరైన సమయంలో తగు సలహాలు ఇవ్వడానికి ఆగ్రోమార్ట్ నెలకొల్పామని తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగపడే డ్రిప్ పరికరాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి : ఎఒ

కలికిరి : తాము పండించే పంటలకు ఇపంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మమతారెడ్డి రైతులను కోరారు. మండలంలో రబి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాలనందు గల గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈప్రక్రియ ఈనెల 25న నాటికి ముగుస్తుందని, ఇప్పటి వరకు పంట నమోదు చేసుకోని రైతులు ఎవరైన ఉన్నట్లతే వెంటనే 25వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలని రైతులను కోరారు. 26 వ తేదీ లోపు రైతులు ఇకేవైసి పూర్తి చేసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్




నిందితుల అరెస్టును చూపుతున్న సిఐ సాధిక్ అలీ

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి-ములకలచెరువు

హత్యకేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ సాధిక్‌అలీ పేర్కొన్నారు. సిఐ కథనం మేరకు.. బురకాయలకోట పంచాయతీ, ఎర్రమసివారిపల్లెకు చెందిన శంకరప్ప నాయుడు(59) ఆదే గ్రామానికి చెందిన బంధువైన శ్రీనివాసులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడని తెలిపారు. ఈ దాడిలో గాయపడిన శంకరప్ప నాయుడు చికిత్స పొందుతూ నివాసంతో మృతి చెందిన విషయం విధితమే.. ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి కేశప్ప సూచనలతో సిఐ సాధిక్ అలీ హత్యకేసులో నిందితులైన శ్రీనివాసులు నాయకుడు(39), అతని కుమారుడు వెంకటేష్ (19)లను మండలంలోని తంబళ్లపల్లి క్రాస్ వద్ద అనుమానిత వ్యక్తులుగా గుర్తించి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.



మల్లయ్య కొండపై చెలరేగుతున్న మంటలు

మల్లయ్య కొండకు నిప్పు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని సాదుకొండ, మల్లయ్య కొండ, ఇనుముకొండ అడవి అగ్నికి ఆహుతి అయ్యింది. బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఇనుముకొండ అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడంతో మంటలు ఎగసిపడ్డాయి. మంటలు చెలరేగి ఇటు మల్లయ్య కొండ అటు సాధుకొండకు పాకడంతో సుమారు 600 హెక్టార్లు అడవి పూర్తిగా కాలిపోయింది. విలువైన కల్పవృక్షాలు, జంతువులు, పక్షులు, క్రిములు, కీటకాలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు అగ్నికి కాలిపోయాయి. అటవీశాఖ అధికారులు గురువారం తెల్లవారు జామున గ్రామస్తుల సహకారంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ అడవులను రక్షించుకోవాలని, ఇలాంటి చేష్టలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.